క్లుప్తంగా

డ్రైనేజీల్లో చెత్త వేయొద్దు



సూచనలు చేస్తున్న కమిషనర్ వెంకటేశ్

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని అన్ని వార్డుల్లో ఇంటింటికీ వచ్చే పారిశుధ్య సిబ్బందికి చెత్త అందించాలని, డ్రైనేజీల్లో చెత్త వేయొద్దని కమిషనర్ వెంకటేశ్ కోరారు. పట్టణంలోని పలువార్డుల్లో పారిశుధ్య పనులను బుధవారం ఆయన పరిశీలించి సిబ్బంది, కాలనీవాసులకు సూచనలు చేశారు. పట్టణంలో సాగుతున్న రోడ్డు విస్తరణ, డ్రైనేజీ పనుల్లో భాగంగా పైపు లైన్ లీకేజీలు అయిన ప్రాంతాలను గుర్తించి పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. వేసవిలో తాగునీటి సమస్యలు లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఏఈ సతీశ్, ఇతర సిబ్బంది ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాల వార్షికోత్సవం



చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శన

ఓదెల: మండలంలోని హరిపురం ప్రాథమికోన్నత పాఠశాలలో వార్షిక వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. వేడుకల్లో చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఎస్ఎంసీ చైర్మన్ అమ్ముల బిక్షపతియాదవ్, ప్రధానోపాధ్యాయుడు మహేందర్‌రెడ్డి, టీచర్లు సూత్రాల శ్రీనివాస్, పావని, హేమలత, హైమవతి, రాజు పాల్గొన్నారు.

అలరించిన నాటక ప్రదర్శన



పెద్దపల్లిరూరల్: మండలంలోని హన్మంతునిపేటలో ప్రదర్శిస్తున్న చిడతల రామాయణంలో భాగంగా బుధవారం నాటక ప్రదర్శన అలరించింది. 28న జరిగే పట్టాభిషేకంతో ఈ నాటక ప్రదర్శన ముగుస్తుందని శ్రీరామకృష్ణ కళాబృందం గురువు తాళ్లపల్లి రాజేశంగౌడ్, డైరెక్టర్ శ్రీనివాస్‌గౌడ్, బయ్య కొమురయ్య, కందుల శ్రీనివాస్, వీరేశం తెలిపారు.

ఇఫ్తార్ విందు

కాల్వశ్రీరాంపూర్: మండల కేంద్రంలోని మసీద్‌లో బుధవారం మాజీ ఎంపీపీ సారయ్య గౌడ్ ఆధ్వర్యంలో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సదయ్య, ఏఎంసీ చైర్మన్ రామిడి తిరుపతిరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ చంద్రారెడ్డి, మాజీ జెడ్పీటీసీ సదయ్య, నాయకులు సతీశ్, రాజమల్లు పాల్గొన్నారు.

అన్నిరంగాల వారికి ఉగాది పురస్కారాలు

పెద్దపల్లిరూరల్: అన్నిరంగాల్లో రాణిస్తున్న యాదవులను గుర్తించి వారిని ప్రోత్సహించేలా ఉగాది పురస్కారాలు అందించాలని నిర్ణయించామని యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు మేకల మల్లేశం తెలిపారు. పెద్దపల్లిలో బుధవారం యాదవ చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు మారం తిరుపతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అవార్డు గ్రహీతల పేర్లను పారదర్శకంగా ఎంపిక చేయాలన్నారు. ఫోన్ ద్వారా వారికి సమాచారం అందించి ఉగాది రోజున రంగాపూర్‌లో జరిగే కార్యక్రమానికి హాజరయ్యేలా చూడాలని సూచించారు. నాయకులు భాస్కర్, రాజ్‌కుమార్, చిలారపు పర్వతాలు ఉన్నారు.

ప్రెస్‌క్లబ్ ఏర్పాటుకు మద్దతు అవసరం లేదు

మంథని: జర్నలిస్టుల సంక్షేమం ముసుగులో తమ సొంత ప్రయోజనాలు చక్కదిద్దుకుంటున్న వ్యక్తుల విషయంలో జర్నలిస్టు సమాజం అప్రమత్తంగా ఉండాలని వర్కింగ్ జర్నలిస్ట్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాడూరు కరుణాకర్ అన్నారు. మంథనిలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంథని డివిజన్ కేంద్రంగా పాత్రికేయ మిత్రులు నూతన ప్రెస్ క్లబ్ ఏర్పాటు చేయడాన్ని జీర్ణించుకోలేని కొందరు వ్యక్తులు వారిపై రాజకీయ ముద్ర వేసి బురదజల్లే ప్రయత్నాలను ఆయన ఖండించారు.

డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడిగా సురేశ్

మంథని: డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడిగా మంథనికి చెందిన గౌరైంకల సురేశ్ ఎన్నికయ్యాడు. గోదావరిఖనిలో ప్రజాసంఘాల కార్యాలయంలో డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోటా రమేశ్ ఆధ్వర్యంలో నూతన కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. కమిటీలో జిల్లా నూతన అధ్యక్షుడిగా సురేశ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

వరిలో తెల్లకంకి ఆందోళనలో రైతన్న

ధర్మారం: ఆరుకాలం కష్టపడి పంట వేసిన అన్నదాతకు ప్రకృతి ఎల్లప్పుడూ పరీక్షలు పెడుతూనే ఉంటుంది. మండలంలోని గ్రామాల్లో రైతులు వరిసాగు చేయగా పంట చేతికొచ్చే దశలో కాండం తొలుచు పురుగు ఆశించి పంటలో కొంత భాగం ఊసతిరిగి (తెల్లకంకి) పోయింది. మండలంలో దాదాపు 18వేల ఎకరాల్లో వరిసాగు చేయగా దాదాపు సగం గ్రామాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. సాగుచేసిన వరిలో దాదాపు 15శాతం వరకు వరి ఊసతిరిగి పోవడంతో పంట దిగుబడి తగ్గుతుందని రైతులు వాపోతున్నారు. మూడు నుంచి నాలుగు సార్లు క్రిమిసంహారక మందులు పిచికారీ చేసినా కాండం తొలుచు పురుగు ఆశించడంతో గొలకలు తెల్లబడ్డాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. బంజేరుపల్లి తండాబి



ఎర్రగుంటపల్లి గ్రామశివారులో ఊసతిరిగిన వరి

గ్రామానికి చెందిన వెంకనాయక్ వరిపొలం 25శాతం ఊసతిరిగిపోయిందని వాపోయాడు. సంబంధిత అధికారులు సరైన సలహాలు అందించడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు.

ఉద్యానవన పంటలతో అధిక ఆదాయం

రామగిరి: ఉద్యానవన పంటలు సాగుచేస్తే అధిక దిగుబడులు రావడమే కాకుండా అధిక ఆదాయం వస్తుందని కొండాలక్ష్మణ్ బాపూజీ రాష్ట్ర ఉద్యానవన విశ్వవిద్యాలయ ఎక్స్‌టెన్షన్ డైరెక్టర్ డా.విజయ అన్నారు. రామగిరి ఖిలాలోని కృషివిజ్ఞాన కేంద్రంలో బుధవారం 13వ శాస్త్రీయ సలహా మండలి సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. కృషివిజ్ఞాన కేంద్రంలోని పండ్లతోటలు, కూరగాయల క్షేత్రాలను అధికారులు, శాస్త్రవేత్తలు, రైతులతో కలిసి పరిశీలించారు. కేవీకే శాస్త్రవేత్త, ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఎ.శ్రీనివాస్, శాస్త్రవేత్తల బృందం గత సంవత్సరం చేపట్టిన కార్యక్రమాలు, వచ్చే సంవత్సరంలో చేపట్టనున్న కార్యక్రమాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. వ్యవసాయ పంటల సాగుతో పోల్చుకుంటే ఉద్యాన పంటలైన పండ్లు, కూరగాయలు, పూలు సాగు చేయడంతో రైతులకు అధిక ఆదాయం వస్తుందన్నారు. రైతులు



మాట్లాడుతున్న విశ్వవిద్యాలయ ఎక్స్‌టెన్షన్ డైరెక్టర్ డా.విజయ

ఆ దిశగా ఆలోచన చేసి ఉద్యాన పంటలు సాగు చేయాలని సూచించాలన్నారు. రైతులకు కావాల్సిన సాంకేతిక సహకారం కృషి విజ్ఞాన కేంద్రం, ఉద్యాన విశ్వవిద్యాలయం అందిస్తుందన్నారు. ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్స్‌లర్ డాక్టర్ డి.రాజిరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో కూరగాయల సాగు పెంపు కోసం పలు గ్రామాలను ఎంపిక చేసుకుని 'మన ఊరు మన కూరగాయలు' అనే కార్యక్రమంలో భాగంగా ఉత్పత్తి చేసిన కూరగాయలను ఆ గ్రామంతో పాటు ఇతర జిల్లాలకు సరఫరా చేసేలా చూడాలని సూచించారు. అనంతరం శాస్త్రవేత్తలు, రైతుల నుంచి పలు సలహాలు, సూచనలు తీసుకున్నారు. సమావేశంలో వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు డాక్టర్ శ్రీధర్ సిద్ధి, డాక్టర్ ఉషారాణి, వ్యవసాయ సంయుక్త సంచాలకులు అంజనీదేవి, నాబార్డ్ ఏజీఎం జై.ప్రకాశ్, డీఆర్డీఏ పీడీ కాళిందిని, జిల్లా పశుపోషణ అధికారి డాక్టర్ శంకర్, డిస్ట్రిక్ట్ వెల్ఫేర్ ఆఫీసర్ వేణు, వ్యవసాయ అధికారులు చిందం శ్రీకాంత్, రామకృష్ణ, ఉద్యాన అధికారి జ్యోతి, జాతీయ రైతు అవార్డు గ్రహీతలు మల్లారెడ్డి, వేముల వెంకటేశ్వర్లు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



సుల్తానాబాద్: బోనాలతో మహిళలు



ఓదెల: కొలనూర్‌లో బోనంతో సంజీవరెడ్డి



ఓదెల: పొత్కపల్లిలో..

వైభవంగా పోచమ్మ బోనాలు

సుల్తానాబాద్: పట్టణంలోని పలు కాలనీలకు చెందిన మహిళలు పోచమ్మ బోనాలు బుధవారం వైభవంగా నిర్వహించారు. బోనాలతో మహిళలు బయలుదేరి వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు.

ఓదెల: మండలంలోని కొలనూర్‌లో బుధవారం పోచమ్మ బోనాలు ఘనంగా జరుపుకున్నారు. వేడుకల్లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి పాల్గొని మొక్కులు చెల్లించారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని నైవేద్యం సమర్పించారు. మాజీ ఎంపీటీసీ పర్శ రమేశ్, నాయకులు పుల్ల సదయ్యగౌడ్, పుల్ల నారాయణ, చినాల రమేశ్, తిరుపతి, ఐలయ్య పాల్గొన్నారు.

ఓదెల: మండలంలోని పొత్కపల్లిలో నల్లపోచమ్మ బోనాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలతో ఆలయానికి చేరుకుని మొక్కులు చెల్లించారు.

ముప్పిరితోటలో ఎల్లమ్మపట్నాలు..

ఎలిగేడు: మండలంలోని ముప్పిరితోటలో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న ఎల్లమ్మ తల్లి పట్నాలు, బోనాల కార్యక్రమంలో భాగంగా బుధవారం ఎల్లమ్మ తల్లికి లగ్నం, పట్నాల కార్యక్రమం నిర్వహించారు. గీత కార్మిక సంఘం అధ్యక్షుడు పూరెల్ల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు రంగు కొమురయ్య, మాజీ ఉపసర్పంచ్ చీకటి శైలజ సంతోష్‌గౌడ్, సంఘం నాయకులు పాల్గొన్నారు.

వన్ నేషన్.. వన్ ఎలక్షన్‌పై అవగాహన

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలోని మదర్ థెరిస్సా ఇంజినీరింగ్ కాలేజీలో బుధవారం వన్‌నేషన్, వన్ ఎలక్షన్ అనే అంశంపై బీజేపీ రాష్ట్ర నాయకుడు లక్ష్మీనారాయణ అవగాహన కల్పించారు. జిల్లా కన్వీనర్ సోమారపు లావణ్య, అధికార ప్రతినిధి కాసిపేట శివాజీ మాట్లాడారు. దేశంలో ఒకేసారి ఎన్నికలు నిర్వహించడంపై దేశం ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి దోహదపడుతుందన్నారు. యువత రాజకీయాల్లోకి రావాలని పిలుపునిచ్చారు. యూత్ పార్లమెంటరీ స్పీకర్స్‌గా ఎంపికైన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌తో



విద్యార్థులకు ప్రశంసా పత్రం

పాటు పార్టీ మండల అధ్యక్షుడు వేల్పుల రమేశ్, కన్వీనర్ కావేటి రాజగోపాల్, శ్రీధర్, మామిడి ఉమేశ్, స్వామి పాల్గొన్నారు.

అధికారులు, ఉద్యోగులకు అభినందన



అభినందిస్తున్న జీఎం లలిత్‌కుమార్

గోదావరిఖని: ఆర్జీ–1 పరిధి జీడీకే 11 ఇంక్లయిన్‌లో 65,100 టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని ఆరు రోజుల ముందుగానే 66,901.82 టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసి లక్ష్యాన్ని అందుకున్నట్లు జీఎం డి.లలిత్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం గని ఉన్నతాధికారులను, అధికారులను, ఉద్యోగులను జీఎం అభినందించారు.

సంక్షిప్త వార్తలు

• వాటర్ పైప్‌లైన్ ధ్వంసం

సుల్తానాబాద్: పట్టణంలోని సుగ్లాంపల్లిలోని శ్మశానవాటికలో వాటర్‌పైపులను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారని మాజీ కౌన్సిలర్ పసెడ్ల మమత మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. మంగళవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారని, అధికారులు వెంటనే మరమ్మతు చేయాలని కోరారు. మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ నియాజ్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మరమ్మతు చేయిస్తామని ఆయన పేర్కొన్నారు.

• ఖని సీఐపై చర్యలు తీసుకోవాలి

గోదావరిఖనిటౌన్: గోదావరిఖని వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డిని సస్పెండ్ చేయాలని కోరుతూ ఏఐఎస్ఎఫ్ నాయకుడు రేణికుంట్ల ప్రీతం బుధవారం రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో సీపీ అంబర్ కిషోర్ ఝాకు వినతిపత్రం అందజేశారు. ప్రీతం మాట్లాడుతూ సమస్య పరిష్కారం కోసం పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన తనను సీఐ పరుష పదజాలంతో మాట్లాడారని ఆరోపించారు. సదరు సీఐపై చర్యలు తీసుకోవాలని సీపీని కోరగా ఆయన సానుకూలంగా స్పందించి విచారణ జరిపి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారని తెలిపారు. ఏఐటీయూసీ నగర కార్యదర్శి శనిగరపు చంద్రశేఖర్, ఏఐఎస్ఎఫ్ నాయకులు ధనాల ఉదయ్, సాయిచరణ్, శివ, దీపక్, కుమార్ ఉన్నారు.

• బిల్డింగ్‌పై నుంచి పడి ఒకరికి తీవ్రగాయాలు

కోల్‌సిటీ: గోదావరిఖని లక్ష్మీనగర్‌లో బుధవారం ఓ బిల్డింగ్‌కు రమేశ్ అనే గృహ నిర్మాణ కార్మికుడు మరమ్మతు పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు పై అంతస్తు నుంచి కింద పడ్డాడు. దీంతో అతడు తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే జీజీహెచ్ ఆస్పత్రికి తరలించారు.

• చికిత్స పొందుతూ ఒకరు మృతి

పాలకుర్తి: మండలంలోని కొత్తపల్లికి చెందిన గుంపుల తిరుపతి (50) బుధవారం చికిత్స పొందుతూ మృతిచెందాడు. బసంత్‌నగర్ ఎస్సై స్వామి వివరాల ప్రకారం కొత్తపల్లికి చెందిన తిరుపతి జేసీబీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇతడికి ఒక కుమారుడు, ఒక కూతురు కాగా ఆరేళ్లక్రితం కుమారుడు ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైన తిరుపతి మద్యానికి బానిసయ్యాడు. అతని ఆరోగ్యం దెబ్బతిని కాలేయం చెడిపోయింది. జీవితంపై విరక్తి చెందిన తిరుపతి మంగళవారం గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మెరుగైన చికిత్స నిమిత్తం కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. కాగా చికిత్స పొందుతూ మరణించాడు. మృతుడి భార్య స్వరూప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

• చికిత్స పొందుతూ యువకుడు..

ధర్మారం: మండలంలోని కొత్తూరు గ్రామానికి చెందిన నెరువట్ల నవీన్ (29) జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా చికిత్స పొందుతూ బుధవారం మరణించినట్లు ధర్మారం ఎస్సై శీలం లక్ష్మణ్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం నవీన్ మద్యానికి బానిసై కుటుంబాన్ని పట్టించుకోలేదు. దీంతో భార్య అనూష, ఇద్దరు పిల్లలు ఇంటి నుంచి వెళ్లిపోయారు. మద్యానికి మరింత బానిసైన నవీన్ జీవితంపై విరక్తి చెంది 24న ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబసభ్యులు కరీంనగర్‌లోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మరణించినట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడి సోదరుడు ప్రవీణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

• గుండెపోటుతో వెల్ఫేర్ ఆఫీసర్..

యైటింక్లయిన్‌కాలనీ: ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీ ఎన్‌సీ–74బంగ్లాస్ ఏరియా క్వార్టర్‌లో ఉంటూ ఓసీపీ–3మైన్‌లో వెల్ఫేర్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న పాగోలు రాజు (54) అనే సింగరేణి ఉద్యోగి బుధవారం గుండెపోటుతో మృతి చెందాడు. గోదావరిఖని టూటౌన్ పోలీసుల వివరాల ప్రకారం రాజుకు తెల్లవారుజామున ఛాతిలో నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు కాలనీలోని డిస్పెన్సరీకి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో గోదావరిఖని సింగరేణి ఏరియా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి భార్య తేజమని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు.

భూగర్భగని సందర్శన



గని సందర్శనలో డీడీఎంఎస్ వెంకన్న, అధికారులు

గోదావరిఖని: ఆర్జీ–1 ఏరియా 2, 2ఏ ఇంక్లయిన్ భూగర్భగనిని బుధవారం డీడీఎంఎస్ బి.వెంకన్న సందర్శించి పని స్థలాలను తనిఖీ చేశారు. ఎస్ఎస్13 బై2 ప్యానెల్ పనిస్థలంలో పైకప్పు, సైడ్‌లను ఎప్పటికప్పుడు గమనిస్తూ ప్రమాదాలకు ఆస్కారం లేకుండా పటిష్టమైన సపోర్టు చేయాలని అధికారులకు, సూపర్‌వైజర్లకు సూచించారు. అనంతరం గనికి సంబంధించిన సర్వే రికార్డులను తనిఖీ చేశారు. ఏరియా రక్షణ అధికారి బి.సాయిప్రసాద్, ఏజెంట్ కె.చంద్రశేఖర్, సాట్యూటరి గని మేనేజర్ డి.రమేశ్‌బాబు, మేనేజర్ ఎస్‌కే అల్లావుద్దీన్, సేఫ్టీ ఆఫీసర్ డి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అమ్మవార్లకు బోనాల సమర్పణ



సుల్తానాబాద్: మున్సిపల్ పరిధి పూసాలలో బొడ్రాయి, మహాలక్ష్మి, భూలక్ష్మి, విగ్రహ ప్రతిష్ఠాపన చేసి ఏడాది పూర్తయిన సందర్భంగా బుధవారం బోనాల సమర్పణ కార్యక్రమం నిర్వహించారు. కాలనీలోని అన్ని కులసంఘాల ఆధ్వర్యంలో బోనాలు ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ఒడిబియ్యం, బోనాలు సమర్పించి పట్నం వేశారు.



కమాన్‌పూర్: మండలంలోని పేరపల్లి గ్రామం నుంచి రొంపికుంట గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి ప్రమాదకరంగా మారింది. రహదారి కింది నుంచి పంట పొలాలకు సాగునీరు వెళ్లేందుకు పైపులైన్ ఉండగా రహదారిపై గుంత ఏర్పడింది. దీంతో రైతులు తాటి మట్టలు, బండరాళ్లు పెట్టారు. మూలమలుపు ఉన్న నేపథ్యంలో రాత్రివేళ రహదారిపై వెళ్లే వాహనదారులు ప్రమాదాల బారిన పడే ప్రమాదం పొంచి ఉంది. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 97053 46608, 98499 71500

సింగరేణి వార్తలు

రక్షణ చర్యలు పాటించాలి

గోదావరిఖనిటౌన్: ఆర్జీ–1 పరిధిలోని ఓసీపీ–5, పీసీ పటేల్ అన్లోడింగ్ క్యాంపును బుధవారం ఆర్జీ–1 జీఎం లలిత్‌కుమార్ సందర్శించి కాంట్రాక్ట్ ఉద్యోగులకు రక్షణకు సంబంధించిన పలు సూచనలు చేశారు. కాంట్రాక్ట్ ఉద్యోగులు రక్షణ చర్యలు పాటించాలన్నారు. అధికారుల ద్వారా రక్షణతో పనిచేసే విధాన పత్రం(ఎస్‌వోపీ) సేఫ్ ఆపరేటింగ్ ప్రొసీడర్‌లో కాంట్రాక్ట్ ఉద్యోగులకు చదివి వినిపించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏరియా



సూచనలు చేస్తున్న జీఎం లలిత్‌కుమార్

ఇంజనీర్ డీవీ రావు, పాజెక్టు ఇంజనీర్ మేనేజర్ అనిల్ గబాలే, అడిషనల్ మేనేజర్ రాములు, ఎస్ఈ రమేశ్, పిట్ సెక్రటరీ ప్రభుదాస్ పాల్గొన్నారు.

ప్రమోషన్లు ఇప్పించండి

యైటింక్లయిన్‌కాలనీ: ఆర్జీ–2 ఏరియాలోని అన్ని మైన్స్, డిపార్ట్‌మెంట్లలో ఐదేళ్ల నుంచి యాక్టింగ్ క్లర్కులుగా విధులు నిర్వహిస్తున్న జనరల్ మజ్దూర్లను జూనియర్ అసిస్టెంట్(క్లర్కు)లుగా ప్రమోషన్ ఇప్పించాలని జనరల్ మజ్దూర్ సింగరేణి కార్మికులు బుధవారం గుర్తింపు సంఘం ఏఐటీయూసీ ఆర్జీ–2 బ్రాంచ్ నాయకులకు వినతిపత్రం అందజేశారు. ఏఐటీయూసీ నాయకులు మాట్లాడుతూ సింగరేణి అధికారులతో మాట్లాడి సమస్యపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామన్నారు. జూనియర్ అసిస్టెంట్ క్లర్కులుగా ప్రమోషన్ వచ్చేలా కృషి చేస్తామని కార్మికులకు హామీ ఇచ్చారు.



వినతిపత్రం ఇస్తున్న జనరల్ మజ్దూర్ కార్మికులు

ఏఐటీయూసీ సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ ప్రకాశ్, ఆర్జీ–2 బ్రాంచ్ సెక్రటరీ రవీందర్, అన్నారావు, సాంబశివరావు, మహేందర్, లోకేష్, విక్రమ్, సమత, కావ్య, జయ, దేవేందర్, రాంసాగర్, తిరుపతి, సంతోష్, రాజు పాల్గొన్నారు.

'ఖని'లో న్యాయవాదుల నిరాహార దీక్ష

గోదావరిఖనిటౌన్: హైదరాబాద్‌లో ఇజ్రాయిల్ అనే న్యాయవాదిని హత్య చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని, న్యాయవాదుల రక్షణ చట్టం తీసుకురావాలని కోరుతూ గోదావరిఖని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం గోదావరిఖని కోర్టు ఎదుట న్యాయవాదులు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. బార్ అసోసియేషన్ సభ్యులు గోసిక ప్రకాశ్, ఇరుగురాల మహేందర్, సంతోష్, గొర్రె రమేశ్, నడిపల్లి కిషన్‌రావు, చందాల శైలజ, దేశెట్టి అంజయ్య, గుల్ల రమేశ్, బోడ సమ్మయ్య, కె.శ్రీనివాసరావు, పెర్క మనోహర్, జూపాక వెంకట్, అసంపల్లి రవీందర్, రాగం శ్రీధర్, పెట్టం వెంకటేశ్వర్లు, కిరణ్‌జీ, పులిపాక రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

దీక్షకు కందుల సంధ్యారాణి మద్దతు

గోదావరిఖనిటౌన్: గోదావరిఖని కోర్టు ఎదుట బుధవారం న్యాయవాదులు చేపట్టిన రిలే నిరాహార దీక్షకు బీజేపీ రామగుండం ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి బుధవారం మద్దతు పలికారు. నాయకులు కోడూరి రమేశ్, గుండబోయిన భూమయ్య, అందె రాజ్‌కుమార్, మామిడి వీరేశం పాల్గొన్నారు.



నిరాహార దీక్షలో న్యాయవాదులు

కార్పొరేటర్ సంఘీభావం

రామగుండం: గోదావరిఖని కోర్టు ఎదుట రిలే దీక్షలు చేపట్టిన న్యాయవాదులకు బుధవారం మాజీ కార్పొరేటర్ కన్నూరి సతీశ్‌కుమార్ సంఘీభావం ప్రకటించారు.

బీఆర్ఎస్‌ను విమర్శించే అర్హత ఐఎన్‌టీయూసీకి లేదు

యైటింక్లయిన్‌కాలనీ: బీఆర్ఎస్‌ను, టీబీజీకేఎస్ సంఘాన్ని విమర్శించే అర్హత ఐఎన్‌టీయూసీ యూనియన్ నాయకులకు లేదని టీబీజీకేఎస్ ఆర్జీ–2 వైస్ ప్రెసిడెంట్ ఐలి శ్రీనివాస్ అన్నారు. బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. టీబీజీకేఎస్ సంఘాన్ని, బీఆర్ఎస్‌ను విమర్శిస్తే ఊరుకునేది లేదని సంఘం నాయకులు ఐలి శ్రీనివాస్, ప్రభాకర్‌రెడ్డి, చంద్రయ్య అన్నారు.

మాదిగలకు మంత్రి పదవి ఇవ్వాలి

మంథని: జనాభా ప్రాతిపదికన ప్రభుత్వం చేయబోయే మంత్రివర్గ విస్తరణలో మాదిగలకు మంత్రి పదవి ఇవ్వాలని మాదిగ జేఏసీ జిల్లా అధ్యక్షుడు అక్కపాక సంపత్‌కుమార్ కోరారు. తమ సామాజిక వర్గానికి చెందిన ఒకరికి మంత్రి పదవి ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు.

మహిళ అదృశ్యం

కోల్‌సిటీ: గోదావరిఖని విఠల్‌నగర్‌కు చెందిన ఆడెపు వెంకటలక్ష్మి (49) అనే మహిళ బుధవారం అదృశ్యమైంది. ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిందని ఆమె కుమారుడు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గోదావరిఖని వన్‌టౌన్ ఎస్సై సోనియా తెలిపారు. ఆమెను గుర్తించిన వారు డయల్ 100కు లేదా 63008 27655 నంబర్‌కు సమాచారం అందించాలని ఎస్సై కోరారు.



వెంకటలక్ష్మి

రాయితీపై వ్యవసాయ పనిముట్లు

సుల్తానాబాద్: వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా జిల్లా మహిళా రైతులందరికీ రాయితీపై పనిముట్లు ఇవ్వనున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి ఆదిరెడ్డి తెలిపారు. బ్యాటరీ స్ప్రేయర్స్, పవర్ స్ప్రేయర్స్, రోటోవాటర్స్, కల్టీవేటర్లు అందుబాటులో ఉన్నాయని, ఈనెల 29వ తేదీలోగా మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.